పి.వి.యస్. అచ్యుతవల్లి



# ప్రయాణం

ముదురాకు పచ్చటి రంగులో బొటన వేలంత వెడల్పు పట్టు అంచుతో వున్న చీరె కట్టుకుని వొంకులు వొంకులు తిరుగుతూ అక్కడక్కడా తలగావులగంగా నెరిసి వున్న జుత్తు జారు ముడి వేసుకుని మరువం, సన్నజాజులు, కనకాంబరం పూవులూ కలిపిన మాల తురుముకుని ఎంతో నిదానంగా స్వంత ఇంటిలో ఒక గదిలోంచి ఒక గదిలోకి వెళ్ళుతూన్నట్లు 'టూ టయిర్' కంపార్ట్‌మెంటులోనికి వచ్చిందావిడ.

మెయిల్ అట్టే రష్‌గా లేదు. ఎంచేతో కోరమాండల్‌కి స్టాపు వుండటంతో రాజమండ్రిలో మెయిల్‌కి రష్ తగ్గింది. పరధ్యానంగా ప్లాటుఫారం మీదకి చూస్తున్న నాకు ముదురాకు పచ్చని చీర కదలికలు కళ్ళని కట్టేశాయి. అతిశ్రద్ధగా ఆమెనే పరిశీలించసాగాను.

ఆమె నా కంపార్ట్‌మెంట్‌లోకే రావడంతో నాకు కొంచెం సంతోషమనిపించింది. ఇంకాస్సేపటికి, ఆమె నా ఎదుటి బెర్త్‌మీద తన లగేజీని వుంచి "యాభయిమూడు" అనుకుంటూ నెంబరు చూసుకుని కూర్చుంది. కంపార్టుమెంటులో ప్రయాణీకులంతా ఎవళ్ళహడావిడిలో వాళ్ళు వున్నారు. ఒక్క ప్రయాణీకుడికి వీడ్కోలు చెప్పటానికి పదిమంది స్నేహితులు రావటంతో ప్లాట్‌ఫారమంతా సందడి సందడిగా వుంది. కనుచీకట్లు ముసురుకుంటున్నాయి. "కాఫీ తీసుకోరా నాన్నా" అంది మా అమ్మాయి

కమల. అంతవరకూ ప్లాటుఫారం మీద తన ఫ్రెండ్సుతో మాట్లాడుతూ నిలుచుంది.

"వద్దులే! నీకు కావాలంటే తీసుకో! విజయవాడలో మీల్స్ తీసుకుంటాను కదా!"అన్నాను. ఆకుపచ్చ చీర. తీరిగ్గా కూర్చుని తాంబూలం నవులుతూ వుంది. మా అమ్మాయి ఆమె ప్రక్కగా కూర్చుంది. యాభయినాలుగో సీటు ఆమె రాజమండ్రిలో దిగిపోయింది. అంచేత రెండు సీట్ల లోనే వీళ్ళిద్దరూ సర్దుకుని కూర్చున్నారు. విండో సీటు అంటే మా అమ్మాయికి ఇష్టం వుండదు. ట్రయిన్ కదిలాక "మీ రటువెంపు కూర్చోండి. నేను ఇటువెంపు కూర్చుంటాను." అంది కమల.

"కిటికీ దగ్గర కూర్చోవటం ఇష్టంలేదా నీకు!" అంది ఆకుపచ్చచీర.

"ఊఁ. హూ." అంది మా కమల. ఆ గొంతు ఎక్కడో విన్నట్లు వుంది.

"నాకూ ఇష్టం వుండదు. ముఖం అంతా గాలి కొట్టుకుపోతుంది. జుట్టు అంతా పీచురేగిపోతుంది." అందామె. మా కమల గ్లాసుడోర్ దింపి నిశ్శబ్దంగా వుండిపోయింది.

"నీవు చాలా మంచి పిల్లవి." అంది మెచ్చుకోలుగా. మా అమ్మాయి నవ్వింది. ఆమెది పచ్చటి పసుపురంగు చాయ. మా కమల చామనచాయ అయినా నలుపుకిందకే వస్తుంది. "పెద్దవాళ్ళ మాటలకు విలువ ఇచ్చే వాళ్ళంటె నాకిష్టం!" అందామె.

"ప్రతి పెద్ద వాళ్ళూ పిల్లలు తమ మాటలకు విలువ ఇవ్వాలని అనుకుంటారు" అంది కమల.

"వాళ్ళు అనుకుంటారని పిల్లలకి తెలుసును కాని వ్యతిరేకించాలనే చూస్తారు. అదే ప్రగతికి నిదర్శనం అనుకుంటారు."

"ప్రగతి అని కాదు. కొంతమంది పిల్లలు పెరుగుతున్న కొద్దీ కొన్ని కొన్ని విషయాలలో కొన్ని స్థిరమయిన అభిప్రాయాలు ఏర్పరచుకుంటారు. అభిప్రాయాల కనుగుణంగా నడుచుకోవాలంటె అవి పెద్దల మాటలకి వ్యతిరేకమయినా వెనుతీయరు. అది వాళ్ళు పెంపొందించుకున్న వ్యక్తిత్వం! దానికి పెద్దవాళ్ళు బోల్డు బాధపడిపోవటం అసమంజసం."

"ఏం చదువుతున్నావు?" అందావిడ.

"సెకండ్ బి.ఎ." అంది కమల. దాని గొంతులో కించిత్తు గర్వపు జీర గరగరమంది.

"నేను ముప్ఫయ్ సంవత్సరాల క్రితం ఎం.ఎ. చదివాను" అందామె. కమల గొంతులోని గర్వ రేఖ గమనించినదానిలాగ!




"ఈజిట్!" అంది కమల. ఆశ్చర్యార్థకాన్ని ఇంగ్లీషులో వెలిబుచ్చుతూ.

"ఎందుకంత ఆశ్చర్యపడిపోతున్నావు?" అందామె.

"మీరు చాల మామూలుగా మాఅమ్మవాళ్ళల్లాగా వున్నారు" అనేసింది కమల.

"నేనూ మీ అమ్మవాళ్ళ కాలంనాటి దానినే. అంచేత వాళ్ళల్లానే వుండటంలో ఆశ్చర్యం లేదు."

"కాలం గురించి కాదు నేననటం!...."

"మరి దేన్ని గురించి?"

"నిజం చెప్పాలంటె మీ అలంకరణ...."

"ఓస్! అదా! నాకు నలుగురు పిల్లలున్నారు. ఇద్దరు మగవాళ్ళు. ఇద్దరు ఆడవాళ్ళు.మరి అలంకరణలో ఇంకెలా వుండాలి?"

"మరీ ఇల్లాగ పుల్లేటికుర్రు చీర కట్టుకుని బొట్టుగాడ్యయేటు అయిన ఆవిడ. ఏమీ స్టయిల్ లేకుండా...." అంటూ సిగ్గుపడిపోయింది కమల. అధిక ప్రసంగం అనుకుందేమో!

"మా పుట్టిల్లు పుల్లేటికుర్రు. మా అన్నయ్య నాకిచీర పసుపుకుంకుమతో ఇచ్చేడు. పుల్లేటికుర్రు నేతచీర కట్టుకుంటే స్టయిల్‌గా వుండదంటావా!" అందావిడ. నవ్వేసింది మా కమల. కళ్ళజోడులోంచి ఆమె ముఖంకేసి పరిశీలనగా చూసేను. ఇంతవరకూ వాళ్ళ సంభాషణ నా చెవులు వింటున్నాయి పలచటి కోల ముఖం పచ్చని రంగుతో మెరుస్తూంది. కళ్ళనిండుగా కాటుక. నుదుట పావలాకాసంత కుంకుమ బొట్టు.చెవులకు ఎర్రటి రాళ్ళదుద్దులు.ముక్కుకి ఎర్రటి రాయి ముక్కుపుడక. మెడలో వంటిపేట పగడాల తావళం. ఆమె సింగారం నిజంగా పాతకాలంగానే వుంది.మా ఆవిడ శ్యామల కూడా ఇల్లాగే వుంటుంది. నలుపురంగు కావటంతో మా శ్యామలకి నేత చీరెలు మరీ నప్పవు. ఆవిడ వాయిల్స్ ప్రింట్సు కట్టదు. యస్సెల్సీ ప్యాసయింది శ్యామల. హిందీ విశారద కూడా ప్యాసయింది. కాని ఎక్కడా చదువుల సరస్వతి వాలకం కనపడదు కమల గోల అదే! "చక్కగా అమెరికన్ జార్జెట్స్. ప్లాట్ క్రేప్ సిల్కు చీరలూ కట్టుకుంటే నాజూగ్గా వుంటావు. ముసలమ్మ చీర లేమిటే!" అంటూ వాళ్ళమ్మని వేధించుతూ వుంటుంది. మా శ్యామల నలుపయినా కళయిన ముఖం. మనిషి సన్నంగా రివటలా వుంటుంది. నాలుగు జతల బంగారు గాజులూ, రెండు జతల పోళ్ళగాజులూ రెండు వరసల పలకసరులూ నిత్యం వేసుకుంటుంది. అందుకనే మా కమల అమ్మ వాళ్ళల్లాగ అనేసింది ఆవిడని. ఆమె జవాబు నాకు తృప్తినిచ్చింది. ఎక్కడో చూశాను. ఎక్కడనో చూశాను అనిపించుతోంది ఆమెని చూస్తున్న కొద్దీను. పుల్లేటికుర్రు అనగానే నాకు మా తాతగారిల్లు గుర్తుకు వచ్చింది. చాలా సార్లు వెళ్ళాను అక్కడికి. మామయ్యలందరూ హైదరాబాదుకి తరలి వెళ్ళిపోయారు. అంచేత ఇంక అక్కడికి వెళ్ళి చూడవలసిన బంధువులు లేరు. "హాయ్! మీది పుల్లేటికుర్రా!" అంది కమల.

"మాది కాదు. మా పుట్టిల్లు పుల్లేటికుర్రు."

"నాన్నా! ఒక్కసారయినా మమ్మల్ని తీసుకువెళ్ళేవుకాదు" అంది నిందాగర్భంగా.

"అక్కడెవరున్నారమ్మా మనకి!" అన్నాను నీరసంగా.

"మీ పెద్ద తాతయ్యగారిల్లు వున్నాదన్నావు కదా!"అంది.

"నీకు అంత చూడాలని వుందా అమ్మాయి!"అన్నదావిడ.

"కాదు ఆంటీ! మా నాన్న ఎప్పుడూ 'కోనసీమలో అంత చల్లగా వుంటుంది ఇంత చల్లగా వుంటుంది లేత కొబ్బరికాయల నీళ్ళు.పనసతొనలు.రామాఫలాలు తెగ తినేవాళ్ళం.ఎంతో హాయిగా ఆడుకునేవాళ్ళం' అంటూ చెపుతూవుండేవారు.ఆంధ్రా వెళ్ళితే తప్పకుండా తీసుకువెళతాననేవారు. తీరా చేసి ఇంత దూరం వచ్చేమా!

పుల్లేటికుర్రు చూడకుండానే వెళ్ళిపోతున్నాము" అంది బెంగగా.

"మీరెవరి తాలూకు !" అన్నదామె నాకేసి చూస్తూ.


"జోగి పంతులుగారి మనమణ్ణి! పంతులుగారు ఈ కాలం వాళ్ళకి గుర్తు వుండరులెండి!" అన్నాను మర్యాదగా.

"అయితే సుబ్బు లత్తయ్య కొడుకు సూరి పండువా!" అనేసింది చటుక్కున. అన్నాక గలగలా గోదావరిలా నవ్వేసింది. కమలకూడానవ్వేసి."మానాన్న సుబ్బులత్తయ్య సూరిపండుకాదు. కమలకు నాన్నగారు సూర్యప్రసాద జగపతిగారు అంటే!"అంది. ఆమె నాకేసి ముగ్ధ దృష్టితో చూస్తోంది.ఆ కళ్ళల్లో ఏదో వెలుగు. ప్రేమ కనిపించాయి నాకు.

"మీరు...." అన్నాను.

"ఆనమాలు కట్టలేనంత మారిపోయాము కదూ ?నేను శంకరమ్మను. మీ తాతగారింటి ప్రక్క ఇల్లేమాది.గుర్తు లేదా!"అంది.

"శంకరమ్మవా! ఇందాకట్నించీ నీ గొంతు విన్నట్లుంది అనుకుంటున్నాను. కాని పోల్చలేకపోయాను. శివకామి ఒక్కదే వున్నట్లున్నాడు పుల్లేటికుర్రులో" అన్నాను. శివశంకరి. శివకామయ్యా. శివరామయ్యా. శివప్రసాద్. శివకృష్ణ. శివకాంత. అని వాళ్ళ పేర్లు. శివ శంకరి. శివకాంత ఆఖరివాళ్ళు. శివకామయ్య పెద్ద అన్నయ్యా. వ్యవసాయం చేయించేవాడు. నిండా పద్దెనిమిది సంవత్సరాలన్నా నిండకుండానే కుటుంబభారం అతని భుజాలమీదపడింది "శివకామీ శివకామీ"అంటూ మా తాతగారూ. మామయ్యలు అతనెంతో ఆదరంగా చూసేవారు. శివశంకరి పిల్లలంతా రాజమండ్రిలో వాళ్ళ మేనమామగారింట్లో చదువుకుంటూవుండేవారు.వాళ్ళూ మేమూ సెలవులకే పుల్లేటికుర్రు చేరేవాళ్ళం. చేతికి వెండిగాజు లోకజతా. మెడలో నల్లటి పట్టుతాడుకి బంగారపు ఆంజనేయుకి పతకమూ. చెవులకి సన్నటి ఎర్రరాయితో అంటుపోగులూ. పల్చటి ముఖమూ మెరిసే కళ్ళనిండా కాటుకా. నుదుట గుండ్రటి అగరుబొట్టూ. చిన్నప్పటి ఆటపాటల మాటెలాగవున్నా నాకు యస్సెల్సీ ప్యాసయి ఇంటరులోకి వచ్చేసరికి పుల్లేటికుర్రు అంటే 'శంకరమ్మ' కోసమే వెళ్లాలనిపించేది. ఎదుటికి వచ్చేసరికి "ఓ తిక్కశంకరీ! తిక్కశంకరీ! చుక్క శంకరీ! చక్కని చుక్క శంకరీ!"అంటూ వేళాకోళం చేసినా ఆ పిల్ల ఆటలు కబుర్లు చాలించి వాళ్ళింటికి వెళ్ళిపోయినా ఆ ముఖమే నా మనస్సులో కదలాడేది. భోజనాలు అయినాక వాళ్ళ అరుగుపీద లాంతరు పెట్టుకుని ఏవో మాగజైన్స్ చదువుతూ కూర్చుంటే నేను వెనకాతలే వెళ్ళి "శివా నామీద కోపం




రాలేదు కదూ!" అంటూ ఆ పిల్ల జడలోని వన్నజాజులుమరువం కలిపిన మాల వాసన చూసేవాడ్ని. "అబ్బ నా మెడమీద తల పెట్టకు. ఏదోలా వుంటుంది" అని విసుక్కునేది.

"అదిగో కోపం పోలేదు కదూ!" అనేవాడిని దీనంగా.


"కోపం లేదు! ఏం లేదులే!విన్నేడిపించలేక అనుకున్నావా నేను వూరుకుంటా! నీకన్నా కవిత్వం నేనూ చెప్పగలను" అనేది నవ్వేస్తూ. ఆ నవ్వుల్లో ముత్యాలు పండి రాలాయి అనిపించేది. "చెప్పు!" అంటే-

"పండూ పండూ ! సూరీపండూ ! మా అన్న తుండూ- ఉతుకుతాను ఉండూ ! నీ వీపు మీద. కూర్చుండూ !" నవ్వేసేవాడిని ఆ పిల్ల కవిత్వానికి.మా చెల్లాయిలు శంకరమ్మ. శివకాంత మంచి స్నేహితురాళ్లు. నాకు బి ఏ ప్యాసుఅయ్యీఅవగానే మాదూరపు బంధువు ఒకాయన "బిన్ని"కంపెనీలో పని చూపించాడు. నాకు ఇంకా చదువుకోవాలనివున్నా చెల్లాయిలు పెళ్ళికి ఎదిగి కూర్చోవటంతో మా నాన్న "నువ్వు ఉద్యోగం చేయక తప్పదురా!" అనేశాడు. పితృవాక్య పరిపాలన కోసం కాగడవులు పట్టి పోనక్కర్లేకుండా. గార్డెన్ సిటీలో మకాం పెట్టటం సరదాయే అనిపించింది. ఒక ఏడాదిపాటు బెంగుళూరు అంతా బస్సు రూట్లు. చుట్టు పక్కల చూడవలసిన స్థలాలు సర్వే చేయటంతో సరిపోయింది. నగర జీవితంలో ఆ సంవత్సరం అంతా ఎందుకనో "శంకరమ్మ" గుర్తు రాలేదు నాకు. ఎక్కడ చూసినా కాగిన పాలమీగడ తరకలాంటి రంగులో నున్నగా మెరిసే చర్మంతో పులిపిల్లల్లా గుర్రుగుర్రు చూస్తుండే కన్నడ అమ్మాయిలు కాళ్ళకు బంధాలు వేసేవారు. ఆ సందడిలో చిన్ననాటి స్నేహితురాలూ. వయస్సులోని వలపుల కలా అయిన శంకరమ్మ మరుగునపడిపోయింది. పైకి చదవాలన్న అభిలాష కొద్దీ ఎం.ఎ.ఎల్ ఎల్.బి. కోర్సు తెప్పించి చదువుకోసాగాను. సంవత్సరం దాటాక ఇద్దరు చెల్లాయిలకీ ఒక్కసారే వివాహాలు చేసేస్తున్నాం అని నాన్న వ్రాయటంతో రాజమండ్రి ప్రయాణం అయినాను. "తాతగారు చూస్తావన్నారు. అంచేత పుల్లేటికుర్రులో పెట్టాం పెళ్ళిసందడి." అన్నది అమ్మ. పుల్లేటికుర్రు అనగానే శంకరమ్మ జ్ఞాపకం వచ్చింది. వారం పదిరోజులు రాజమండ్రి నించి పుల్లేటికుర్రు.పుల్లేటికుర్రు నించి రాజమండ్రి పెళ్ళిసామాన్లు జేరవేయటంతో సరిపోయింది.ఇంటినిండా బంధుజనం కిటకిటలాడిపోతున్నారు పెళ్ళి-అందునా రెండుపెళ్ళిళ్ళుఅవటంతో జనం చాలా మందే పోగయినారు. ఇంట్లో ఎవళ్ళకీ నిద్రాహారాలు లేవు. ఇంత సందడిలోంచి తప్పించుకుందుకు ఒక రాత్రి పదిగంటలు దాటాక 'శివకామీ' అని పిలుస్తూ వాళ్ళింటికి వెళ్ళాను నిజానికి శివకామి. తమ్ముళ్ళు. మా మామయ్యలతో కలిపి 'రాజోలు' ఎవరినో పిలుచుకుని రావటానికి వెళ్ళారు. ఇంట్లో అక్కచెల్లెళ్ళిద్దరే వుంటారని తెలుసును.

"అన్నయ్య ఇంట్లో లేడని తెలుసుండీ ఎందుకిలా వచ్చేవు ?" అంది శంకరమ్మ. బారెడు పొడుగ్గా ఎదిగినట్లు కనిపించింది. లేత గులాబీ రంగు జరీ చీర కట్టుకుంది. తెలటి వాయిల్ జాకెట్టు!"తోచక వచ్చేనులే! ఏం చేస్తున్నావు!"అన్నాను. "పెరటిలోకి రా! చూద్దువుగాని!"అంది.వెంట వెళ్ళేను. పెరడంతా శుభ్రంగా అలికి రకరకాల ముగ్గులు పెట్టివున్నది. అయిదారు మడతమంచాలు. నాలుగయిదు నవ్వారు మంచాలు వరుసగా వేసి వున్నాయి. తెల్లటి దుప్పట్లు. తలగడలు వున్నాయి.

"కూర్చో!" అంది.

"ఏమిటి విశేషాలు!" అన్నాను ఒక మడత మంచంమీద జారబడుతూనూ-చాలా అలసటగా వుంది ఎంచేతో!




కళ్ళు మూసుకున్నాను. వెన్నెల్లో చల్లగా హాయిగా వేప చెట్టుగాలి! మామిడికాయల తీపివాసన! వాళ్ళ పెరడు చాల విశాలంగా ఉంటుంది. దూరంగా రామాఫలాల చెట్లు. బొప్పాయి చెట్లు. మామిడి. కొబ్బరిచెట్లు దట్టంగా దగ్గర దగ్గరగా వుంటాయి.

"ఏమిటా నిద్ర కబుర్లు చెప్పకుండా!" అంటూ వీపుకి జారబడి ఒకటే కుదిపింది.

"అలసటగా వుంది ఎంచేతో!" అన్నాను కళ్ళు మూసుకునే! నుదురుమీద చేయివేసింది.

"అబ్బో వేడిగా వుంది. వస్తానుండు" అంటూ లోపలికి వెళ్ళి మంచిగంధం గిన్నె తెచ్చింది. నుదుటికి పట్టించింది.

"అబ్బా! ఏమిటి చేస్తున్నావు!" అన్నాను కళ్ళు తెరవకుండానే. ఆ చల్లదనానికి ప్రాణం సేద తీరుతూంది. కొంచెం కొంచెం నిస్త్రాణ తగ్గుతూంది.

"చందనచర్చ" అంది నవ్వుతూనూ.

"ఇంట్లో సందడి లేదేమిటి!" అన్నాను లేచి కూర్చుంటూ.

"అమ్మా, చెల్లాయి మీ ఇంట్లోనే వున్నారుకదా! అన్నయ్యలు, తమ్ముడూ మామయ్యలతో రాజోలు వెళ్ళారు. అదీ తెలుసు నీకు."

"నువ్వు ఇంటికి కాపలాగా వున్నావు కాబోలు. ఎక్కడా కనపట్టం లేదేం?"

"నీకు చూడటానికి తీరిక లేకపోతే ఎల్లాగ కనపడతానూ!"

"అసలు మా ఇంటి వేపు వొస్తున్నావా!"

"ఎందుకు రావటంలేదు ? వారం రోజులబట్టి భోజనాలు మీ ఇంట్లోనే కదా! మేమంతానూ !"

"ఇల్లంతా సున్నం కొట్టించి, పసుపురాసిన గుమ్మాలకి మామిడాకుల తోరణాలు. అంతా కొత్తగా వుంది. నీకు కూడా పెళ్ళేమిటి!" అన్నాను పరిహాసంగా.

"మీ ఇంటికి వచ్చిన బంధువులకి విడిది ఇమ్మన్నారు మీ తాతగారు. అంచేత అన్నయ్య ఇంటికి సున్నం వేయించేడు. నా పెళ్ళి అంత సులువుగా అవుతుందా పండూ!"

"ఎందుకు అవదు! బంగారు బొమ్మలాంటి దానివి. కళ్ళ కద్దుకుని చేసుకుంటారు ఎవరైనా! నిన్ను వద్దనే మూర్ఖుడుండడులే !"

"నిజంగా చేసుకుంటారంటావా సూరిపండూ?"

"ఏమిటా పిలుపు! ప్రసాదు అనకూడదూ!"

"ఎల్లా పిలుస్తేనేం? మీ తాతగారు పిలవడంతో అలా అలవాటు అయిపోయిందిలే! మన వూళ్లో అందరూ సూరిపండు గాడు పెద్ద ఉద్యోగం చేస్తున్నాడుట. సుబ్బులు అదృష్టవంతురాలు. ఒక్కచేతో ఇద్దరమ్మాయిలకు పెళ్ళిళ్ళు చేసేస్తున్నారు. అంటూ ఒకటే చెప్పుకుంటున్నారు అనుకో !"

"అప్పుడే ఒక దరికి వచ్చేమా శివా! ఇంకా ఇద్దరున్నారు కదా! వీళ్ళకి చీరసారె పెట్టి అత్తవారిళ్ళకు పంపేసరికి వాళ్ళకు కూడా సంబంధాలు వెతుక్కోవాలి."

"నీకు ఆడపిల్లల బరువుబాధ్యతలు బాగా తెలిసినట్లున్నాయే"

"ఎందుకు తెలియదు! నేనింకా చదువుకోవాలనుకున్నా. వీళ్ళకి పెళ్ళిళ్ళు చేయాలనే మా నాన్న నన్ను ఉద్యోగానికి వెళ్ళమని తొందర చేశాడు."

"అవునులే! నువ్వు సంపాదించుతున్నావు కనుకనే మీ నాన్నగారు పదేసివేల రూపాయలు కట్నాలు ఇచ్చి మీ చెల్లాయిలకు పెద్ద పెద్ద సంబంధాలు చేస్తున్నారు. అలా మా వాళ్ళను ఇమ్మంటే ఇచ్చుకోగలరా! ఆడపిల్ల బరువు, బాధ్యత తెలుసును అంటున్నావు?"

"ఏమిటి నువ్వనేది!"

"చిన్నప్పటినించి సుబ్బులత్తయ్య నా కోడలు. నా కోడలు అంటూ ముద్దు చేసేది. తాతయ్యగారు కూడా ఏమే శివా, మీ ఆయనకి పెద్ద ఉద్యోగం వచ్చిందేవ్! అంటూ పిలిచి చెప్పారు. అందుకనే...."

"అందుకని!"

"మా అన్నయ్య అడిగితే ఇరవయివేలు కట్నమయినా, నాలుగెకరాల తోట అయినా ఇవ్వాలన్నారుట! అంత ఇచ్చుకోగలరా! అయినా అంత సొమ్ము ఖర్చు చేయగల స్థితిలో వుంటే మీ సంబంధమే కావాలా! బోలెడంత మంది దొరుకుతారు" అంది.

"దొరకరని కాదు! మరి నాలాంటి వాడు దొరకాలిగా!" అన్నాను నవ్వుతాలుగా.

"ఓయబ్బ! ఏమిటి నీ గొప్ప" అనేసింది.

"నువ్వు కావాలనుకోవటమే నా గొప్ప!"

"మాటలు మూటలుకట్టటం కాదు. అయిన సంబంధమని మా అన్నయ్యలు ఆశపడ్డారు. అంతే!"

"వాళ్ళకేనా ఆశ! నీకేమీ లేదా!"

"ఉంటే మటుకు! అవకాశాలు లేనివాళ్ళు ఆశలు పెంచుకోకూడదు."

"ఆశ వుంటే అవకాశం దానంతటదే దొరుకుతుంది."

"అవకాశం ఎల్లా దొరుకుతుంది?"

"నేను సుబ్బులత్తయ్య కోడల్నే కావాలి అని పేచీ పెట్టు. మీ అన్నయ్యలు దిగి వస్తారు బేరానికి! తెలిసిందా!"

"అమాటే నువ్వు అంటే మీ నాన్న దిగివస్తారు కదా! సూరీ! మీరంత మరీ లేనివాళ్ళు కాదు. నలుగురాడపిల్లల పెళ్ళి ఖర్చు ఒక్క మగపిల్లవాడివల్ల రాబట్టుకోవాలనుకోవడం పేరాశ సూరీ! ఎదుటి ఆడపిల్లవాళ్ళు కూడా మనలాంటి సంసార్లే అని ఎందుకు ఆలోచించరు! ఆ మాత్రం డబ్బు కావాలంటే అప్పుగా అయితే ఇస్తారు కాని కట్నంగా ఇచ్చెయ్య అంటే మిగిలిన వాళ్ళు ఎల్లా పైకి వస్తారు! చెప్పు!"

"మీ ప్రసాద్ డాక్టరు చదువుతున్నాడు కదా. అతనికి నాలుగు-ట్లు ఎక్కువ తీసుకోమను."

"మా అన్నయ్యకు అవ్వాలి కదా ! వాళ్ళ వాళ్ళ అభిప్రాయాలు ఎలా వున్నాయో ! నీలా కట్నాలు తీసుకుని కుటుంబాన్ని ఉద్ధరించాలన్న ఆశయం వాళ్ళకి వుందొద్దా?"

"అసలు ఎంత ఇస్తామన్నారు మీఅన్నయ్యలు?" "అయిదు వేలుకట్నం ఎకరం తోట పసుపుకుంకుమ క్రింద ఇస్తామన్నారు."




"అబ్బో చాల వార వుంది. బేరం కుదరదు." అన్నాను నవ్వుతూ. ఆ రోజు అల్లా అనేశాను కాని, అన్న వేళావిశేషం కాబోలు నిజంగానే మా నాన్నగారు ఒప్పుకోలేదు. అక్కడికీ మా అమ్మ దగ్గిర చాలాసార్లు నసిగాను.

"నీకు తెలుసుకదే అమ్మా! శంకరమ్మ అంటే నా కిష్టమని. డబ్బుకోసం వద్దనేస్తే ఎల్లాగ!...." అన్నాను.

"బోలెడంత అప్పు పీకలమీదవుంది. నువ్వలా పంతంపట్టి కూర్చుంటే ఎల్లాగరా సూరీ! వాళ్ళయినా మరీ లేనివాళ్ళు కాదు. శివకామి ప్రయోజకుడు. పాతికముప్ఫయ్‌వేలు వడ్డీలకు తిప్పుతున్నాడు. ప్రసాద్ డాక్టరు చదువుతున్నాడా. క్రిష్ణగాడు ఇంజనీరు చదువుతాడుట. శివరామయ్య అప్పుడే టీచరు ట్రయినింగు పూర్తిచేశాడు. వీళ్ళందరివల్లా రాబడి లేదా! ఎకరానికి అర ఎకరానికి ముష్టి బేరాలు ఆడతాడు? అసలు ఆ పదెకరాలతోటా సావిత్రమ్మకు పుట్టింటి వారు ఇచ్చిందే! స్త్రీధనం! మరి ఇద్దరాడపిల్లలకూ చెరివక అయిదెకరాలూ రాదా! గీసిగీసి బేరాలు ఆడుతాడా!" అన్నారు నాన్నగారూ. నిజమే అనిపించింది నాకు కూడా. దేవదాసూ. దిలీప్‌కుమార్ వేసిన హిందీ సినిమాలూ చాలా చూశాను. కాని అంతటి త్యాగపూరితమయిన ప్రేమ నా మనస్సుకి పట్టలేదు. మా మధ్య చిన్ననాటి చెలిమి వుంది. అంతకన్నా మరే ఉన్మాదమయిన ఆకర్షణ లేదు. ఇద్దరికీ కుటుంబంమీద ప్రేమ. గౌరవం వున్నాయి. అంచేత ఇద్దరం ఎవరికి వారుగా అయిపోయేము.

"అయితే మీరిద్దరూ స్నేహితులే అన్నమాట" అంది మా కమల.

"ఎక్కడ వుంటున్నావు!" అన్నాను.

"మద్రాసులోనే!" అంది.

"మీ అన్నయ్య లిద్దరూ?...."

"క్రిష్ణ. ప్రసాదు అమెరికా వెళ్ళిపోయారు. రామన్నయ్య ఏలూరులో సెటిలయ్యాడు. కాంత బొంబాయిలో వుంది. నువ్వు బెంగుళూరులో సెటిలయ్యావుట కదా!"

"ఊ. ఇల్లు కట్టుకున్నాము శేషాద్రిపురంలో. నాన్న. అమ్మ మావద్దే వున్నారు. ఇది నాకు ఒకత్తె కూతురు" అన్నాను.

బెజవాడలో మీల్స్ వచ్చేయి. భోజనం చేయమంటే చేయలేదు శంకరమ్మ. "పీకలదాకా తినే బయలుదేరాను. ఇంకేమీ వద్దు" అంది. మెయిల్ తక్కుతూ తారుతూ వెళ్ళేసరికి 'బృందావన్' సెంట్రల్‌లో బయలుదేరబోతూంది.

"హడావిడిగా పరుగెట్టుకు వెళ్ళటమెందుకు! రాత్రి బండికి వెళ్దురుగాని. మా ఇంటికి రండి. చాలా ఏళ్ళకి కలుసుకున్నాం" అంది. మా కమలకి ఆమె మంచి స్నేహితురాలు అయిపోయింది ఈ ప్రయాణంలో. ఇంటికి వెళ్ళాము. శంకరమ్మ భర్త ఏదో బిజినెస్ చేస్తున్నాడుట! మర్యాదగా పలకరించేరు. ఇంటిలో వంటకూ పనికీ మనుష్యులు వున్నారు. శంకరమ్మకి ఒక కారూ. భర్తకి ఒక కారూ వున్నాయి. పిల్ల లంతా తల్లిలాగే చురుగ్గా. అందంగా వున్నా అధునాతనంగా వున్నారు. మా కమల చాల సరదాగా కలిసిపోయింది వాళ్ళతోటి. రోజు అంతా కబుర్లతో గడిచిపోయింది. పిల్ల లకు నచ్చింది కమల. వచ్చేస్తూంటె శంకరమ్మ అంది.

"సూరీ! మీ కమల మా పిల్లల్లో కలిసిపోయింది. మా అబ్బాయిల్లో ఎవరికో ఒకరికియ్యకూడదా!" అంది.

"అబ్బా నాకు రాలేదు శివా! వరసలు అవీ...."

"ఇంకా అదే మనస్సులో మెదులుతూందా! రెండు కుటుంబాల మైత్రీ భావానికి పిల్లలు వంతెన ల్లాంటివారు. అకారణంగా దూరమయ్యాం. అవకాశం వున్నప్పుడు ఆశ పడటంలో తప్పులేదుకదా!"

"మీ ఆయన ఒప్పుకోవద్దా! కమల అట్టె బాగుండదు కూడా!"

"పిల్లల మాట కాదనరు ఆయన! పిల్లలు నా మాట కాదనరు...." గర్వంగా అంది శంకరమ్మ.

"నాకు భయంగా వుంది శంకరీ. మన చిన్నప్పటి మాటలు మీ ఆయనకు తెలిస్తే...."

"తెలుసు ఆనాటి సూరిపండువు నువ్వే అని. మనం చాలా దూరం ప్రయాణంచేశాం సూరీ! ఇంకా అవ్వేతలపోతలు ఎందుకు. మనసుని అల్ల కల్లోలపరచి జీవితాన్ని శూన్యతలోకి తోస్తుంటాయి. ఎప్పటికప్పుడు జీవితాన్ని మరొక కోణంలోంచి అర్థం చేసుకుందుకు ఆలోచించాలి. అప్పుడు నీకు శూన్యం కనపడదు. ఆనందం. ఆశ. సుఖం ఎప్పుడూ నీ చుట్టూ వుంటాయి. స్వల్ప ప్రయత్నంతోనే అందుకోగలుగుతావు" అంది శంకరి.

"సరే!" అన్నాను. శంకరి మనస్ఫూర్తిగా ఆనందించింది నా మాటకు! "పుల్లేటికుర్రు చూడలేదని గునిసావుకదే కమలా! నీకు సంవత్సరాని కొకసారి చూపెట్టుందిలే మీ అత్తగారు" అన్నాను కమలతో. కమల తెల్లబోయింది. అయినా ఆ పిల్ల కళ్ళల్లో ఉత్సాహం ఉరికింది. అంత పెద్ద మేడా. కార్లూ. వంట మనిషి. పనిమనుషులూ.... కనీసం ఆడపిల్ల కలలో కూడా ఊహించలేనంత సిరిసంపదలూ. మంచి మనస్సులూ స్నేహశీలతా....

ఒకానొక గౌరవ మర్యాదలకు లోబడిపోయి.....

....అల్లా విడిపోయినందుకు ఒక బాధ. బెంగా సంసార చట్రంలో ఇరుక్కుపోయి క్రమక్రమంగా మర్చిపోయినా....

తిరిగి మళ్ళీ ఇంకొక గౌరవ మర్యాదలకు చేరువ అవుతున్నందుకు

దిగులు..సంతోషం....భయం..ఆశ....ఏమిటో నాకే తెలియలేదు. అస్సలు నేనేమిటో నాకే ఎపుడు తెలియలేదు కదా! జీవితం పొడుగునా అస్పష్టతనే పోషించుకు వచ్చేనా అనిపించింది.

చాలాదూరం ప్రయాణం చేసినా. ఇంకా ప్రయాణం ఆగలేదా.... అనిపించింది నాకు మరి....